నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 30 ఏప్రిల్ 2024 | NIZAMABAD



బిచ్కుందలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం



రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం పక్కన గాలి అనిల్‌కుమార్, హన్మంత్‌షిండే

## జనం నమ్మట్లేదని దేవుళ్ల మీద ఒట్లు

- హామీలిచ్చి మోసగించిన కాంగ్రెస్, బీజేపీ : పోచారం ధ్వజం
- ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపు

బిచ్కుంద, ఏప్రిల్ 29: వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మోసం చేసింది.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ముందు వారిని ప్రజలు నమ్మడం లేదని దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేతో కలిసి బిచ్కుంద, పిట్లం మండలాల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పోచారం మాట్లాడారు. కాంగ్రెస్ హామీలను నమ్మి జనం మోసం పోయారని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం పెడతామన్నారు. 18 ఏండ్లు పైబడిన మహిళలందరికీ పింఛన్లు ఇస్తామన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిండ్రు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఫ్రీ బస్ మినహా ఏ ఒక్కటీ అమలు చేయలేదని మండిపడ్డారు. డిసెంబర్ 9న చేస్తామన్న రుణమాఫీ చేయలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు పంద్రాగస్టు లోపు చేస్తామని చెప్పడం ఓట్ల కోసమేనని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మోసం చేసిన తమను ప్రజలు నమ్మడం లేదని, అందుకే ఎక్కడకు పోయినా దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నారని మండిపడ్డారు. పదేండ్ల పాలనలో కల్యాణలక్ష్మి, పింఛన్లు, రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా వంటి ఎన్నో పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌దని స్పష్టం చేశారు. మరి రైతులు, ప్రజల కోసం కేంద్రంలోని బీజేపీ ఏం చేసిందని ప్రశ్నించారు. బుద్ధి తక్కువ మాటలు చెప్పేవాళ్లకు కర్రు కాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే అనిల్‌కుమార్, షిండేతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నాగమడుగును పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. మన బతుకులు బాగు పడాలంటే బీఆర్‌ఎస్ రావాలని, కేసీఆర్ తోనే తెలంగాణ ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.




# బీఆర్‌ఎస్.. ఫుల్ జోష్

- రోడ్ షోలతో జనంలోకి కేసీఆర్
- ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బస్సు యాత్ర
- బ్రహ్మరథం పడుతున్న ప్రజలు
- కేడర్‌లో నూతనోత్సాహం నింపుతున్న టూర్
- నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో మే 5, 6 తేదీల్లో..
- జహీరాబాద్ పరిధిలో 7న బస్సుయాత్ర
- మాజీ సీఎం కోసం ఇందూరు ఎదురుచూపులు

నిజామాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)
లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు అనూహ్య స్పందన లభిస్తున్నది. గులాబీ బాస్ నేరుగా ఫీల్డ్‌లోకి దిగడంతో పార్టీలో నూతనోత్సాహం వెల్లివెరిస్తున్నది. కేసీఆర్ రోడ్‌షోలకు జనం వెల్లువెత్తుతున్నారు. ఎక్కడకు వెళ్లినా మాజీ సీఎంకు బ్రహ్మరథం పడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్‌ఎస్ వెనుకబడిందని ప్రచారం చేసిన ప్రత్యర్థి పార్టీలకు మింగుడు పడడం లేదు. కేసీఆర్ టూర్‌కు వస్తున్న స్పందనను చూసి ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీకి కునుకు పట్టడం లేదు.

**అడుగడుగునా బ్రహ్మరథం..**

ఆరోగ్యం సహకరించక పోయినప్పటికీ ప్రజల కోసం, తెలంగాణ బాగు కోసం కదిలిన బీఆర్‌ఎస్ అధినేతకు అడుగడుగునా ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు. ఏప్రిల్ 24న మొదలైన బస్సుయాత్రకు బ్రహ్మరథం పడుతున్నారు. రైతులు, పేదలు, మహిళలు, యువకులు తరలి వచ్చి కేసీఆర్‌కు జేజేలు కొడుతున్నారు. మార్పు పేరుతో కాంగ్రెస్ చేసిన మోసాన్ని గులాబీ బాస్ దృష్టికి తీసుకొస్తున్నారు. అబద్ధాల హామీలతో బొటాబొటి మెజార్టీతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మెడలు వంచే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమేనని జనం స్పష్టం చేస్తున్నారు. నమ్మించి జనాలను నట్టేట ముంచిన హస్తం పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్న కేసీఆర్ నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్తున్నది. రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల్లో కేసీఆర్‌కు అండగా నిలువాలన్న తాపత్రాయం కనిపిస్తున్నది.

### ప్రజల్లో అమితాసక్తి..

కేసీఆర్ బస్సుయాత్రకు వస్తున్న అపూర్వ స్పందనతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో కలవరం మొదలైంది. అదే సమయంలో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. గెలుపు అవకాశాలు భారీగా పెరగడంతో గులాబీ నేతలంతా రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అనేక లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్ పరస్పరం సహకరించుకుంటున్నాయని బలంగా ప్రచారం జరుగుతున్నది. ఈ కుట్రను ఛేదిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి వాస్తవాలను చెబుతూ అవగాహన కల్పిస్తున్నారు. స్వల్ప ఓట్ల ఆధిక్యంతో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ తీరును కేసీఆర్ అడుగడుగునా ఎండగడుతున్నారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని విడమరిచి చెప్పడంతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నారు. అధికారంలోకి వచ్చి 5 నెలలు పూర్తవుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి కేవలం రాజకీయ ఆరోపణలు మినహా రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టడం లేదు. పైగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారు. ఈ పరిస్థితులను కేసీఆర్ తన దైన శైలిలో ప్రజలకు విశదీకరిస్తున్నారు. ఉద్యమ కాలంలో సంధించిన మాటల తూటాలను బస్సు యాత్రలో పేలుస్తూ కాంగ్రెస్ బండారాన్ని బట్టబయలు చేస్తూ దిగ్విజయంగా బస్సు యాత్రను కొనసాగిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బకొట్టేందుకు బీజేపీ, కాంగ్రెస్ ఉమ్మడిగా కుట్రలు చేస్తున్నప్పటికీ గులాబీ దళపతి మాత్రం మొక్కవోని దీక్షతో ప్రజల్లోకి వెళ్తూ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

### ముచ్చటగా మూడు రోజులు..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, బాల్కొండ, బోధన్‌తో పాటు జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్‌తో పాటు సంగారెడ్డి జిల్లాలోని నారాయణ్‌ఖేడ్, ఆలేరు, జహీరాబాద్ ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కేసీఆర్ బస్సు యాత్ర మూడు రోజుల పాటు కొనసాగనున్నది. మే 5న జగిత్యాల జిల్లాలో కేసీఆర్ రోడ్‌షో నిర్వహించనున్నారు. ఆ రోజు రాత్రి అక్కడే బస చేస్తారు. తర్వాతి రోజు మే 6న కేసీఆర్ నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. రాత్రి ఇందూరులోనే విశ్రాంతి తీసుకుంటారు. మే 7న కామారెడ్డిలో రోడ్‌షో అనంతరం మెదక్ జిల్లాకు బయల్దేరి వెళ్తారు. మొత్తం మూడు రోజుల పాటు మూడు జిల్లాల్లో రెండు లోక్‌సభ స్థానాల్లో కేసీఆర్ పర్యటన కొనసాగనున్నది. బాస్ పర్యటనకు భారత రాష్ట్ర సమితి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. కేసీఆర్ పోరుబాటలో భాగంగా బస్సుయాత్రలో బీఆర్‌ఎస్ శ్రేణులు, నాయకులు, ప్రజాప్రతినిధులంతా పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.



## కాంగ్రెస్ హామీలపై నిలదీయండి



రోడ్ షోలో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

- మోసం చేసిన ఆ పార్టీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్/మోర్తాడ్(కమ్మర్‌పల్లి), ఏప్రిల్ 29 : హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వేల్పూర్ మండలం వెంకటాపూర్, కుకునూర్, కోమన్‌పల్లి, కమ్మర్‌పల్లితోపాటు ఉప్లూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో వేముల మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల్లో పదమూడు హామీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. వందరోజులైనా అమలుచేయడంలేదన్నారు. ఉచిత బస్సు ఒకటి మాత్రమే అమలుచేసిందని, మిగతావి ఎటు పోయాయని రేవంత్ సర్కార్‌ను ప్రశ్నించారు. గ్రామానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను హామీలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. దేశంలో ఏ సీఎం చేయని అభివృద్ధి పనులు కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగాయని, అంత చేసినా కాంగ్రెస్ అబద్ధపు హామీలనే జనం నమ్మారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ప్రొసీడింగ్ కాపీలు ఉత్తవేనని ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు..కలెక్టర్‌తో చెప్పిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఒకవైపు తీవ్రమైన విద్యుత్ కోతలు, మరోవైపు తాగునీటితో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 140 రోజులకే ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ..మున్ముందు ఇంకెన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

**పసుపు బోర్డు ఎక్కడ?**

పసుపు బోర్డు ఏర్పాటైందని చెబుతున్న బీజేపీ అభ్యర్థి అర్వింద్.. అది ఎక్కడ ఏర్పాటు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే పసుపు బోర్డు ఏర్పాటు చేశామని నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత లోక్‌సభ ఎన్నికల్లో మోసం చేసి ఎంపీగా గెలిచిన అర్వింద్‌కు ఈ ఎన్నికల్లో రైతులు బుద్ధి చెబుతారని అన్నారు.

# నిరసనలు.. నిలదీతలు

- ప్రశ్నించిన గన్నారం
- నాడు అర్వింద్‌ను.. నేడు జీవన్‌రెడ్డిని..
- ఆరు గ్యారెంటీలపై ప్రశ్నించిన గ్రామస్తులు
- బిక్కమొహం వేసిన కాంగ్రెస్ నాయకులు
- మూడేండ్ల క్రితం అర్వింద్‌ను సైతం అడ్డగించిన జనం
- మోసపూరిత పార్టీలను ధైర్యంగా నిలదీస్తోన్న వైనం

నిజామాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)
మోసపూరిత పార్టీలను నిలదీసే గ్రామంగా నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గన్నారం ప్రత్యేకతను సంతరించుకున్నది. ఆ ఊరి జనాల చైతన్యం ఇప్పుడు మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. హామీలు అమలు చేయని వారిని ప్రశ్నిస్తున్న ఈ గ్రామ ప్రజలు.. తాజాగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను నిగ్గదీశారు. నిజామాబాద్ లోక్‌సభ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం రాత్రి గన్నారంలో ప్రచారానికి వచ్చారు. ఊకదంపుడు ప్రసంగాలు చేస్తోన్న తరుణంలో ఓపిక నశించిన గ్రామస్తులు ఒక్కసారిగా రివర్స్ అయ్యారు. చెప్పింది చాలు.. పింఛన్లు ఏవి? నీళ్లు ఏవి? కరెంట్ ఏది? అని రైతులు, మహిళలు గట్టిగా ప్రశ్నించారు. దీంతో అధికార పార్టీ నేతలంతా తెల్లముఖం వేశారు. ప్రజల ప్రతికూల స్పందనను గమనించిన కాంగ్రెస్ ముఖ్య నేతలంతా ఏమి చేయాలో తెలియక తికమక పడ్డారు. తీరా ఎమ్మెల్యే భూపతిరెడ్డి కలుగజేసుకుని, మాట్లాడుతుండగా ఎవ్వరూ మధ్యలో అంతరాయం కలిగించొద్దంటూ కోరారు. అయినప్పటికీ మహిళలు తమ బాధను, తమలోని ఆక్రోశాన్ని నిర్మొహమాటంగానే బయట పెట్టడం ఆశ్చర్యపర్చింది. మూడేండ్ల క్రితం కూడా ఇలాగే.. గ్రామానికి వచ్చిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పరాభవం ఎదురైంది. ఎంపీగా గెలిపిస్తే ఐదు రోజుల్లోనే పసుపుబోర్డు తెస్తానని చెప్పి మాట తప్పిన అర్వింద్‌ను గన్నారం గ్రామస్తులు ముఖం పట్టుకుని నిలదీశారు. పసుపుబోర్డు ఏర్పాటు ఎక్కడ? అని 44వ జాతీయ రహదారి పొడవునా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బాండ్ పేపర్ హామీ ఏమైందంటూ రైతులు చాలా మంది అడగడంతో కంగుతిన్న అర్వింద్ ఏమి చేయలేక ఆగమాగం కావాల్సి వచ్చింది. తీరా కారు ఆపితే ఎక్కడ తనపై దాడి చేస్తారోనన్న భయంతో వేగంగా దూసుకెళ్లారు.



ఆరు గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్న గన్నారం గ్రామస్తులు



అర్వింద్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తూ నిరసన తెలుపుతున్న ముస్లిం మహిళలు

## అర్వింద్‌కు నిరసన సెగ

- నమాజ్ చేస్తుండగా ఎంపీ వెక్కిరింత
- అడ్డుకున్న ముస్లిం మహిళలు

ముప్కాల్, ఏప్రిల్ 29: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ముస్లిం మహిళల నుంచి నిరసన సెగ తగిలింది. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆయనను అడ్డుకున్నారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండల కేంద్రంలో సోమవారం రాత్రి అర్వింద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమీపంలో ఉన్న మసీదు నుంచి నమాజ్ మొదలు కాగానే.. ఇది మనకు అవసరమా? అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. నమాజ్ పూర్తయ్యాక అర్వింద్ మాట్లాడుతూ పూజ చేసుకుంటే దేశమంతా వినిపించాలా? అని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి మసీదుల్లో ఉన్న 35 వేల స్పీకర్ల సౌండ్‌ను తగ్గించారని, పర్మిషన్ లేని 11 వేల స్పీకర్లను కట్ చేయించారన్నారు. హిందువులకు కావాల్సిన చట్టాలు రావాలంటే మరోసారి నరేంద్ర మోదీ రావాలని, 400 సీట్లలో గెలిపించాలని కోరారు. అప్పటికే అర్వింద్ చేసిన వ్యాఖ్యల గురించి ప్రచారం జరగడంతో ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అడ్డుకున్నారు. ఎవరి దేవుణ్ని వారు పూజిస్తారని, ఇలా వ్యాఖ్యానించడం సరికాదన్నారు. మీకు మా ఓట్లు అవసరమా? అని ప్రశ్నించారు. 'ఇష్టం ఉంటే వేయండి లేకుంటే వద్దు. జై శ్రీరాం' అనుకుంటూ అర్వింద్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మరింత నొచ్చుకున్న ముస్లిం మహిళలు అక్కడున్న బీజేపీ నేతలతో వాగ్వాదానికి దిగారు.



గాయాలతో చిన్నారి

## పసిపాపపై పైశాచికం

- మద్యం మత్తులో బిడ్డను కొడుతూ భిక్షాటన

నందిపేట్, ఏప్రిల్ 29 : మద్యం మత్తులో ఆరు నెలల పసిపాపపై తల్లి పైశాచికంగా ప్రవర్తించింది. పీకల దాకా మందు తాగి తన ఒడిలో ఉన్న తన బిడ్డను తీవ్రంగా కొట్టుకుంటూ భిక్షాటన చేసింది. గమనించిన మహిళలు దేహశుద్ధి చేసి ఆమెను పోలీసులకు అప్పగించారు. వివరాలు.. నందిపేట్ బస్టాండ్ వద్ద సోమవారం ఓ యాచకురాలు తన బిడ్డను చంకలో వేసుకుని భిక్షాటన చేసింది. ఎవరైనా భిక్షం వేయకపోతే తన చంటి బిడ్డను ఇష్టమొచ్చినట్లు కొడుతూ మూర్ఖంగా ప్రవర్తించింది. అప్పటికే పసిపాప కాళ్లకు గాయాలై కట్లు కట్టి ఉన్నాయి. మద్యం మత్తులో పాపను కొట్టడమే కాకుండా డబ్బులు లేవన్నందుకు అక్కడున్న దుకాణాల్లో గందరగోళం సృష్టించింది. బస్టాండ్ వద్ద ఉన్న మహిళలు పాపను తీసుకొని మద్యం మత్తులో ఉన్న తల్లిని చితకబాదారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తల్లిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పసిపాపకు సపర్యలు చేసేందుకు ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ ముందుకు రావడంతో పోలీసులు వారి వద్ద ఉంచినట్లు తెలిసింది.

## అభ్యర్థుల లెక్క తేలింది

- 'నిజామాబాద్' బరిలో 29 మంది..
- 'జహీరాబాద్'లో 19 మంది అభ్యర్థులు
- గుర్తుల కేటాయింపు

కంఠేశ్వర్, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన ఘట్టం ముగిసింది. సోమవారంతో నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగియగా, బరిలో ఉన్న అభ్యర్థుల లెక్క తేలింది. నిజామాబాద్ నియోజకవర్గంలో 29 మంది, జహీరాబాద్ స్థానంలో 19 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. సోమవారం చివరి రోజు ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు ముత్యం రఘు, పోతు నాగార్జున్, పోతు రవి నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఇక, జహీరాబాద్ స్థానంలో ఏడుగురు తమ దరఖాస్తులను ఉపసంహరించుకున్నారు. చివరకు 19 మంది బరిలో మిగిలారు.

**గుర్తుల కేటాయింపు..**

నిజామాబాద్ లోక్‌సభ బరిలో నిలిచిన 29 మంది అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసిన అనంతరం బరిలో ఉన్న అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు కలెక్టరేట్‌లో భేటీ అయ్యారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో ఈసీ మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థుల పేర్లను బట్టి అధికార తెలుగు భాషా వర్ణమాల ప్రకారం క్రమ సంఖ్య, గుర్తులను కేటాయించారు.

